

ప్రక్షాళన చేయరూ!

- ఐదేళ్ల నుంచి కొన్ని శాఖలను భ్రష్టు పట్టించేసిన అధికారులు
- వైసీపీ ప్రజాప్రతినిధులకు అనుకూలంగా విధులు
- కూటమి ప్రభుత్వం రాకతో అక్రమార్కుల్లో గుబులు
- వీళ్లను మార్పు చేయాలంటూ జిల్లా వాసుల డిమాండ్



(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

వైసీపీ పాలనలో కొన్ని కీలక ప్రభుత్వ శాఖలు నిర్వీర్యం అయిపోయాయి. జిల్లాలో కొంత మంది అధికారులు.. వైసీపీ ప్రజాప్రతినిధులకు అనుకూలంగా వ్యవహరించారు. విధులను నిర్లక్ష్యం చేసి.. వైసీపీ నేతల ఆజ్ఞలకు తలుపుతూ.. వారి అక్రమాలకు సహకరించారు. ప్రస్తుతం ప్రభుత్వం మారిపోయింది. ఎన్డీయే కూటమి అధికారంలోకి రాగా.. జిల్లాకు కేంద్ర, రాష్ట్ర మంత్రి పదవులు కూడా రెండు దక్కాయి. గత ప్రభుత్వంలో చోటుచేసుకున్న అవినీతి ప్రక్షాళనకు రంగం సిద్ధమవుతోంది. ఈ క్రమంలో ఉద్యోగుల బదిలీలు, అక్రమార్కులపై చర్యలు తీసుకోనున్నట్టు ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో గతంలో వైసీపీ ప్రజాప్రతినిధులకు సహకరించిన.. అవినీతిపరుల అధికారుల్లో గుబులు రేగుతోంది. అప్పుడు ఆ పార్టీకి సహకరించిన అధికారులు... ఇప్పుడు 'మీరు ఎలా చెబితే అలానే చేస్తాం' అంటూ కొత్త ప్రజాప్రతినిధులను కలిసి వేడుకుంటున్నారు. కాగా.. అవినీతికి పాల్పడిన అధికారుల ప్రక్షాళనపై కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శ్రద్ధ చూపాలని జిల్లావాసులు డిమాండ్ చేస్తున్నారు.

● పోలీసులనూ.. మార్పు చేయాల్సిందే..

గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులతో అంటకాగి.. వారి అరాచకాలకు ఊతమిచ్చేలా పలువురు పోలీసు అధికారులు వ్యవహరించారు. ఇక జిల్లా పోలీస్ బాస్ సంగతి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. రైతులకు ప్రయోజనం చేకూర్చే ఎత్తిపోతల పథకాల మోటార్లు, కాపర్ వైర్లు చోరీకి గురయ్యాయి. వాటిపై క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని ఆదేశించిన సందర్భాలు లేవు. టెక్కలి నియోజకవర్గంలో ఎమ్మెల్సీ దువ్వాడ అడ్డదిడ్డంగా వ్యవహరించినా.. అతనిపై నామమాత్రపు చర్యలు కూడా లేవు. పైగా ఆయన చెప్పినట్లు కొంతమంది పోలీసులు వ్యవహరించారు. కొంతమంది సీఐలు, ఎస్ఐలు, ఇద్దరు డీఎస్పీలు సైతం ఏకపక్షంగా వ్యవహరించి.. వైసీపీ నేతలతో అంటకాగారు. అటువంటి వారంతా ఇప్పుడు తమ స్థానాలను పదిలం చేసుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. కుల సామాజికవర్గాలను పైకి తీసుకువచ్చి.. ఇక్కడే ఉంటామని.. ఎమ్మెల్యేలకు, మంత్రులకు చెప్పాలంటూ కొంతమంది మధ్యవర్తులతో రాయబారం నడుపుతున్నారు. ఆమదాలవలసలో ఓ సీఐ, శ్రీకాకుళం నియోజకవర్గంలో ఓ ఎస్ఐ, శ్రీకాకుళంలోని ఇతర విభాగాల్లో పనిచేస్తున్న కీలక అధికారులు సైతం ఇలానే మంతనాలు సాగిస్తున్నారు. ఇక సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆశించిన రీతిలో పనిచేయలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మొన్నటి ఎన్నికల సమయంలో మద్యం ఏరులై పారింది. అప్పటి అధికార పార్టీ వైసీపీ నాయకులు.. ముందస్తుగా మద్యం కొనుగోలు చేసుకుని డంపులు మాదిరిగా ఉంచుకున్నా.. అలాగే ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి బెల్ట్ దుకాణాలకు మద్యం సరఫరా అవుతున్నా చర్యలు లేవు. అవినీతికి అలవాటుపడినవారిని జిల్లా నుంచి సాగనంపాలని.. పోలీసుశాఖ, సెబ్‌లో కొంత మంది ఉద్యోగులను ప్రక్షాళన చేయకపోతే జిల్లాకే మాయని మచ్చ అని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



డీఎంహెచ్‌వో కార్యాలయం

నిద్రావస్థలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ...

ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యసేవలు సక్రమంగా అందడం లేదు. చాలా ఆస్పత్రుల్లో ఇప్పటికీ ప్రసవాలు జరగడంలేదు. పీహెచ్‌సీ పరిధిలో కాకుండా... దర్జాగా జిల్లాకేంద్రం నుంచి వైద్యులు రాకపోకలు సాగిస్తున్నారు. పీహెచ్‌సీల్లో తనిఖీచేసి.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై తీసుకున్న చర్యలూ లేవు. స్కానింగ్ కేంద్రాలపై నిఘా పెంచామనే ప్రకటనలు తప్ప.. ఆకస్మిక తనిఖీలు లేవు. స్కానింగ్ సెంటర్లలో రేడియాలజిస్టులున్నారా.. వారే స్కానింగ్ చేస్తున్నారా.. ముందస్తు గర్భస్థ శిశు నిర్ధారణ వంటి పరీక్షలేమైనా చేస్తున్నారా? అన్నవాటిపై నిఘా పెట్టలేకపోతున్నారు. అలాగే కొంతమంది ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు.. శ్రీకాకుళంలో సొంత క్లినిక్‌లకు అతుక్కుపోతున్నారు. ఓపీ వేళల్లో సైతం సేవలు అందించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇంతవరకూ రాజకీయ సిఫారసులతో డిప్యూటేషన్ల పేరిట జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో తిష్టవేశారు. ఇక జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారే... అధిక సమయం డేఅండ్‌నైట్ జంక్షన్‌లోని ఓ ప్రైవేటు క్లినిక్‌కు అతుక్కుపోతున్నారు. ఇక పీహెచ్‌సీల వైద్యుల పరిస్థితి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వైద్యులు, ప్రొఫెసర్లందరూ.. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళ ఎఫ్ఆర్ఎస్‌లో హాజరు వేసేసి.. వారి క్లినిక్‌లకు వెళ్లిపోతున్నారు. డేఅండ్‌నైట్ జంక్షన్‌లోని ఉన్న ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యులందరూ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వైద్యులే. జీతం అక్కడ.. అదనపు సంపాదన ఇక్కడ. ఇటువంటివాటికి ఇప్పటికైనా కళ్లెం వేయాల్సి ఉంది. పూర్తిస్థాయిలో వైద్యులందరూ ఓపీ సమయంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని.. జిల్లా ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



తూనికలు, కొలతల శాఖ కార్యాలయం

ఆ రెండు శాఖలు మరీ అధ్వానం..

తూనికలు కొలతలు శాఖ, ఆహార కల్తీ నియంత్రణశాఖ సిబ్బంది.. తాము ప్రభుత్వ ఉద్యోగులమే నన్న విషయం మరిచిపోయారేమో అన్న సందేహం ప్రజల్లో కలుగుతోంది. తూనికల్లో వ్యత్యాసం జరుగుతున్నా.. పండ్ల దుకాణాల నుంచి పలుచోట్ల వ్యాపారులు వినియోగదారుల్ని మోసం చేస్తున్నా తూనికలు కొలతలు శాఖ అధికారులు తీసుకున్న చర్యలు లేవు. మొక్కుబడిగా కేసులు నమోదు చేసి.. మమ అనిపించేస్తున్నారు. ఇక ఆహార కల్తీ నియంత్రణ అధికారులు.. దాడులు చేసిన దాఖలాలు లేవు. శ్రీకాకుళంలో అన్ని జంక్షన్లలో ఇష్టానుసారంగా కల్తీ జరుగుతోంది. రంగులువేసి మాంసాహారాన్ని విక్రయిస్తున్నారు. హోటళ్లలో నిల్వచేసిన మాంసాన్ని వండిపెడుతున్నారు. ఇటువంటి వారి వద్ద అధికారులు మామూళ్లు తీసుకుని.. చూసీచూడనట్టు వదిలేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇక శ్రీకాకుళంలో ఏ చిరు దుకాణానికి వెళ్లినా సరే నిషేధిత పొగాకు ఉత్పత్తులు లభిస్తున్నాయి. ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తేనే దాడులు చేస్తున్నారు. కనీసం ఖైనీ విక్రయాలు కూడా నియంత్రించలేక పోవడం ఆహార కల్తీనియంత్రణ అధికారులు వైఫల్యమేనని పలువురు ఆరోపిస్తున్నారు. వీటిపైనా సమగ్రంగా విచారణ నిర్వహించి.. మొక్కుబడిగా విధులు నిర్వహించే కీలక శాఖల అధికారులను, అవినీతికి అలవాటుపడిపోయిన ఉద్యోగులపై కనీసం బదిలీవేటు వేసి జిల్లాను ప్రక్షాళన చేయాలని ప్రజలు పెద్దఎత్తున కోరుతున్నారు. దీనిపై మంత్రులు, ఎమ్మెల్యేలు ఏరీతిన స్పందిస్తారో.. ఎంతమంది ఉద్యోగులు ఉంటారో.. ఎంతమంది వెళ్తారో వేచిచూడాలి.

కీలక అధికారి తీరుతో సమగ్ర 'భక్ష'..



ధర్మపురం ప్రభుత్వ పాఠశాల

సమగ్ర శిక్షకు ఏటా కోట్లాది రూపాయల బడ్జెట్ ఉంటుంది. విద్యాశాఖ అమలుచేసే అత్యధిక కార్యక్రమాలకు సమగ్రశిక్ష నుంచే నిధులు మంజూరవుతుంటాయి. కస్తూర్బా, వసతిగృహాలు, పాఠశాలల మరమ్మతులు, విద్యార్థులకు యూనిఫామ్ నుంచి పుస్తకాల పంపిణీ వరకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలోనే జరుగుతుంది. పాఠశాల భవనాల నిర్మాణాలను కూడా ఈ శాఖ ఆధ్వర్యంలో చేపడతారు. వైసీపీ హయాంలో ఏమాత్రం సంబంధంలేని.. అవగాహనలేని ఒకరిని తీసుకువచ్చి మొదటి రెండేళ్లు సమగ్ర శిక్షకు అధికారిగా నియమించారు. ఈ పోస్టుకోసం రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తికి భారీమొత్తంలో చెల్లించినట్లు అప్పట్లో ప్రచారం సాగింది. ఆతర్వాత ఆ పోస్టులో కొనసాగిన వ్యక్తి.. ఇందులో తాను కోల్పోయిందే అధికమని నిర్ధారణకు వచ్చి మాతృశాఖకు వెళ్లిపోయారు. ఆ తర్వాత వైసీపీ నేతకు ఏవిధంగా డబ్బులు సమకూర్చాలో తెలిసిన అధికారిని నియమించారు. ఆ అధికారిపై ఆరోపణలు వచ్చినా.. కిందిస్థాయి ఉద్యోగులు ఫిర్యాదు చేసినా ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోలేదు. అలా వైసీపీ ప్రభుత్వంలో నెట్టుకొచ్చేసిన ఆ ఉద్యోగి.. ప్రస్తుతం ప్రభుత్వం మారిపోవడంతో తన పోస్టును కొనసాగించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మేరకు గతంలో 2014 నుంచి 2019 సమయంలో జిల్లాలో ఓఎస్డీగా వ్యవహరించిన ఉద్యోగితో మంతనాలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే సమగ్రశిక్షను సమగ్రభక్షగా మార్చిన ఆ అధికారిని వెనుకేసుకు వస్తే ప్రస్తుత అధికార పార్టీనాయకులపైనా ఆరోపణలకు అవకాశముంది. దీనిపై మంత్రులిద్దరూ కలుగజేసుకుని ఆ అధికారిని సాగనంపాలని పలువురు కోరుతున్నారు.

నిందితురాలు పరారీ?

శ్రీకాకుళం క్రైం, జూన్ 21: ఓ మహిళపై దాడి ఘటనలో నిందితురాలిగా ఉన్న మరో మహిళ పరారీ అయింది. నవభారత్ జంక్షన్‌లోని ఓ మహిళను ఇంటికెళ్లి చితకబాది.. నడివీధిలో ఈడ్చుకెళ్లిన ఘటనలో ఐదుగురు మహిళలను పోలీసులు బుధవారం అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వీరిలో ఒకరు జీజీహెచ్(రిమ్స్) నుంచి పరారీ కాగా.. ఆమె కోసం పోలీసులు గాలిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. ఎచ్చెర్ల మండలం నవభారత్ జంక్షన్‌లో దాసరి మంగపై మంగళవారం దమ్మలవీధికి చెందిన అల్లిపిల్లి రాధ, కోడ భవానీ, అల్లిపిల్లి లక్ష్మి, కుందు జయ, అల్లిపిల్లి నీలిమ, మైలపిల్లి కృష్ణవేణితో పాటు మరో ఇద్దరు అమానుషంగా దాడి చేశారు. రోడ్డుపై ఈడ్చుకెళ్తూ.. కారం చల్లి పైశాచికం చూపారు. ఆమె అపస్మారక స్థితికి చేరుకోగా.. జీజీహెచ్(రిమ్స్)లో చేర్పించారు. మెలకువ వచ్చిన తర్వాత ఆమె.. ఔట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీకాకుళం సీఐ ఎల్.సన్యాసినాయుడు బాధితురాలి నుంచి వివరాలు సేకరించి.. ఘటన ఎచ్చెర్ల పరిధిలో జరగడంతో ఆ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

● బాధితురాలి ఫిర్యాదు మేరకు మంగళవారం రాత్రి వన్‌టౌన్ పోలీసులు.. ముగ్గురు మహిళా నిందితులను స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించారు. వారిలో ఒకరి కుమార్తె తన ఆరోగ్యం బాగోలేదని పోలీసులకు చెప్పింది. దీంతో తల్లీ, కొడుకు సాయంతో ఆమెను పోలీసులు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేర్పించారు. ఇదే సమయంలో ఓ నిందితురాలు ఆస్పత్రి నుంచి పరారైంది. దీంతో ఎచ్చెర్ల పోలీసులు అల్లిపిల్లి లక్ష్మి, కోడ భవానీ, కుందు జయ, అల్లిపిల్లి నీలిమ, మైలపిల్లి కృష్ణవేణిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న నిందితురాలి కోసం గాలిస్తున్నారు.

న్యాయం చేయండి..

తనపై దాడికి పాల్పడినవారిపై చర్యలు తీసుకుని.. తనకు న్యాయం చేయాలంటూ బాధితురాలు మంగ వేడుకున్నారు. శుక్రవారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. దమ్మలవీధిలో తనపై అసభ్యకరంగా దాడికి సహకరించిన గాయత్రి, అల్లిపిల్లి రాధ కొడుకు శ్రీకాంత్‌పై పోలీసులు కేసు నమోదు చేయకపోవడం వెనుక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. కాగా.. ఈ కేసుపై పోలీసులు పూర్తిస్థాయి విచారణ చేపడుతున్నారు.

అచ్చెన్న ఆరోసారి

- అశోక్ మూడోసారి..
- నలుగురు ఎమ్మెల్యేలు తొలిసారి
- అసెంబ్లీలోకి అడుగిడిన సభ్యులు
- ప్రొటెం స్పీకర్ సమక్షంలో ప్రమాణ స్వీకారం



ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేస్తున్న అచ్చెన్నాయుడు



ప్రమాణ స్వీకారం చేస్తున్న బెందాళం అశోక్, కూన రవి, బగ్గు రమణమూర్తి, గౌతు శిరీష, గొండు శంకర్, మామిడి గోవిందరావు, ఎన్.ఈశ్వరరావు

(శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి/ టెక్కలి/ నరసన్నపేట/ పలాస/ ఆమదాలవలస/ పాతపట్నం/ ఇచ్ఛాపురం)

కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. శుక్రవారం శాసనసభా సమావేశాలు ప్రారంభం కాగా.. ఇటీవల ఎన్నికల్లో విజేతలుగా నిలిచిన ఎమ్మెల్యేలంతా ప్రొటెం స్పీకర్ బుచ్చయ్య చౌదరి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లాకు సంబంధించి ఎన్డీయే కూటమి తరఫున ఎనిమిది మంది ఎమ్మెల్యేలు గెలుపొందగా.. వారిలో నలుగురు తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్టారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు(ఎన్ఈఆర్) తొలిసారిగా ఎన్నికయ్యారు. వీరంతా సీఎం చంద్రబాబు ఆశీస్సులు అందుకున్నారు. వైసీపీ సీనియర్ నాయకుడు ధర్మాన ప్రసాదరావుపై భారీ మెజార్టీతో గెలుపొందావంటూ.. గొండు శంకర్‌ను సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఎమ్మెల్యేలంతా మాట్లాడుతూ.. నియోజక వర్గాల అభివృద్ధే ధ్యేయమని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

● టెక్కలి నియోజకవర్గానికి చెందిన కింజరాపు అచ్చెన్నాయుడు ఆరోసారి ఎమ్మెల్యేగా గెలుపొంది.. ప్రమాణ స్వీకారం చేశారు. 1996లో జరిగిన ఉప ఎన్నికల్లో హరిశ్చంద్రాపురం నియోజకవర్గం నుంచి పోటీచేసిన కింజరాపు అచ్చెన్నాయుడు మొదటిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. 1999లో రెండోసారి, 2004లో మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. నియోజకవర్గ పునర్విభజన తర్వాత.. 2014, 2019, 2024లో వరుసగా మూడుసార్లు టెక్కలి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014-19 మధ్యకాలంలో అచ్చెన్నాయుడు కార్మికశాఖ, క్రీడలు, యువజన శాఖ, వెనుకబడిన తరగతులు సంక్షేమం, జౌళిశాఖ మంత్రిగా కూడా పనిచేశారు. ఈసారి రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ అభివృద్ధి, మత్స్యశాఖ మంత్రిగా ఆయనకు బాధ్యతలు అప్పగించారు.

● ఇచ్ఛాపురం ఎమ్మెల్యేగా బెందాళం అశోక్ వరుసగా మూడోసారి ఎన్నికై.. ప్రమాణ స్వీకారం చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబును కలిసి ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి శ్రమిస్తానని వెల్లడించారు.

● ఆమదాలవలస ఎమ్మెల్యేగా కూన రవికుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం సీఎం చంద్రబాబునాయుడు, ఇతర సీనియర్ నేతలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వివరించారు.

● నరసన్నపేట ఎమ్మెల్యేగా బగ్గు రమణమూర్తి రెండోసారి గెలుపొంది.. ప్రమాణ స్వీకారం చేశారు. ప్రజలు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని తెలిపారు. సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడు సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. సాగునీరు, తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతామన్నారు.

● శ్రీకాకుళం ఎమ్మెల్యేగా గొండు శంకర్ ప్రమాణ స్వీకారం చేశారు. 'తొలిసారి అసెంబ్లీలో శాసనసభ్యుడిగా ప్రవేశించాను. నియోజకవర్గంలో ఐదేళ్ల నుంచి పేరుకుపోయిన సమస్యలను పరిష్కారం దిశగా సీఎం దృష్టికి తీసుకువెళ్తాను. జిల్లా కేంద్రం అభివృద్ధికి మంత్రుల నుంచి నిధులు తీసుకువస్తాను. అధినేత చంద్రబాబునాయుడు.. నన్ను గుర్తుపెట్టుకుని అభినందించిన విషయం మరిచిపోలేనిది' అని గొండు శంకర్ పేర్కొన్నారు.

● పలాస ఎమ్మెల్యేగా గౌతు శిరీష ప్రమాణ స్వీకారం చేశారు. అసెంబ్లీ రికార్డుల్లో ఆమె తొలిసంతకాన్ని చేశారు. అసెంబ్లీలో అడుగుపెట్టడం ఆనందంగా ఉందని, పలాస ప్రజలకు రుణపడి ఉంటానని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలన్నీ త్రికరణశుద్ధితో అమలు చేస్తానని స్పష్టం చేశారు. 'వైసీపీ పాలనలో మహిళలపై రాజకీయంగా దారుణంగా విమర్శలు చేసేవారు. స్థానిక పరిస్థితులు మరింత కఠినంగా ఉన్నా వాటన్నింటినీ అధిగమించాం. తాత సర్దార్ గౌతు లచ్చన్న, తండ్రి గౌతు శివాజీ మాదిరిగా పలాస నియోజకవర్గ ప్రజలకు సేవచేయాలన్న గట్టి తలంపు ఉంది' అని శిరీష తెలిపారు.

● పాతపట్నం ఎమ్మెల్యేగా మామిడి గోవిందరావు తొలిసారిగా ఎన్నికై.. అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం అధినేత చంద్రబాబును, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌ను, మంత్రి నారా లోకేశ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. 'పాతపట్నం నియోజకవర్గంలో వంశధార నిర్వాసితుల సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదు. అత్యధిక మంది ఉపాధికోసం వలసలు పోతున్నారు. ప్రజలకు సేవచేయాలనే తలంపుతోనే రాజకీయాల్లోకి వచ్చాను. ప్రజల సమస్యలను పరిష్కరిస్తాను. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా'నని గోవిందరావు పేర్కొన్నారు.

● ఎచ్చెర్ల ఎమ్మెల్యేగా నడుకుదిటి ఈశ్వరరావు(ఎన్ఈఆర్) తొలిసారిగా ఎన్నికై.. ప్రమాణ స్వీకారం చేశారు. 'ఎచ్చెర్ల నియోజకవర్గంలో పరిశ్రమలున్నా.. ఉపాధి కోసం చాలామంది యువత ఇతర జిల్లాలకు, ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిపోతున్నారు. వారికోసం ఏదైనా చేయాలంటే అధికారం ఉండాలి. ఎన్డీయే కూటమిలో భాగంగా బీజేపీ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందాను. తొలిసారిగా అసెంబ్లీలో ప్రవేశించినందుకు ఆనందంగా ఉంది. సమస్యల పరిష్కారంతోపాటు.. యువతకు ఉద్యోగావకాశాలు తీసుకువచ్చేలా ప్రయత్నిస్తా'నని ఎన్.ఈశ్వరరావు తెలిపారు.

ఆకట్టుకున్న యోగాసనాలు



ఇచ్ఛాపురం: ఈదుపురంలో..

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని.. శుక్రవారం వివిధ పాఠశాలల్లో విద్యార్థులు వేసిన ఆసనాలు ఆకట్టుకున్నాయి. ఇచ్ఛాపురం మండలం ఈదుపురం పాఠశాలలో విద్యార్థులు ఆంగ్ల వర్ణక్రమంలో 'యోగా డే' ఆకృతిలో ఆసనాలు వేసి ప్రదర్శన చేపట్టారు. జలుమూరు కేజీబీవీ విద్యార్థులు వృత్తాకార ప్రదర్శనలో విభిన్న ఆసనాలు వేసి ఆకట్టుకున్నారు. యోగాతోనే ఆరోగ్యమని, మానసిన ప్రశాంత లభిస్తుందని పలువురు వక్తలు తెలిపారు.

(ఇచ్ఛాపురం/ జలుమూరు)



జలుమూరు: కేజీబీవీలో..

దిక్సూచి DIKSUCHI

కోర్ బ్రాంచెస్‌లో బెస్ట్ సివిల్ ఇంజనీరింగ్

ఇంజనీరింగ్ అంటే కంప్యూటర్ సైన్స్ అన్నట్లుగా రోజులు మారాయి. నిజానికి కోర్ ఇంజనీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్ లేదు. ఇంజనీరింగ్ మూలపుటమ్మలుగా ప్రసిద్ధి చెందిన మూడింటిలో సివిల్ ఒకటి కాగా మెకానికల్, ఎలక్ట్రికల్ తతిమా రెండూ. ఇప్పుడు ఉన్న ఇంజనీరింగ్ బ్రాంచ్‌లన్నింటికీ మాతృకలు ఇవే. అయితే కంప్యూటర్ మోజులో ప్రపంచవ్యాప్తంగా చాన్నాళ్లుగా సివిల్ ఇంజనీరింగ్‌కు ఆదరణ బాగా తగ్గింది. ఆ నేపథ్యంలో సదరు డిసిప్లిన్ అవసరాన్ని, అవకాశాలను **రాయపూర్ ఎన్ఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావు** తార్కికంగా వివరించారు.



భౌతికంగా లేదంటే సహజంగా ఏర్పాటైన కట్టడాల డిజైన్, నిర్మాణం, నిర్వహణ కలగలిసిన వృత్తిపరమైన డిసిప్లిన్ సివిల్ ఇంజనీరింగ్. పబ్లిక్ వర్క్స్ అంటే రహదారులు, వంతెనలు, కాల్వలు, డ్యామ్‌లు, ఎయిర్‌పోర్టులు, మురుగునీటి వ్యవస్థలు, పైప్‌లైన్‌లు, భవనాలకు సంబంధించిన స్ట్రక్చరల్ కాంపోనెంట్స్, రైల్వేలు, వాటర్ సప్లయ్, ఇండస్ట్రియల్ ప్రాజెక్టులు, నివాస గృహాలు సహా భూమి, నీరు, పర్యావణం, సివిలైజేషన్ అలాగే సంబంధిత ప్రాసెసెస్‌కు సంబంధించిన వన్నీ సివిల్ ఇంజనీరింగ్‌లోకే వస్తాయి.

రిలేటెడ్ బ్రాంచ్‌లు

సివిల్(కన్‌స్ట్రక్షన్), సివిల్(పబ్లిక్ హెల్త్ అండ్ ఎన్విరాన్‌మెంట్) ఇంజనీరింగ్, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, సివిల్ అండ్ రూరల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్(కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ), సివిల్ ఇంజనీరింగ్(ఎన్విరాన్‌మెంట్ అండ్ పొల్యూషన్ కంట్రోల్), సివిల్ ఇంజనీరింగ్(పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్), సివిల్ ఇంజనీరింగ్(రూరల్ ఇంజనీరింగ్), సివిల్ టెక్నాలజీకి తోడు ప్లానింగ్, ఆర్కిటెక్చర్‌కు అందులోని ఉప విభాగాలకూ ఇదే మాతృక.



కౌన్సెలింగ్ గైడెన్స్

అవకాశాలు

ప్రభుత్వ, ప్రైవేటు విభాగాల్లో సివిల్ ఇంజనీర్లకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయి. ప్రభుత్వ అంటే మున్సిపల్ కార్పొరేషన్స్, వాటర్ బోర్డులు, ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ, న్యూఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్, మెట్రోరైల్, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఢిల్లీ స్టేట్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్, మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీసెస్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఎయిర్ ఫోర్స్, రైల్వేస్, ఇరిగేషన్ అండ్ ఫుడ్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్, నేషనల్ హైడ్రో-ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్, నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్, ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్, డిఫెన్స్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్, ఆర్ఐటీఈఎస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డులు, వివిధ సంస్థలకు చెందిన బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ విభాగాలు సహా ఈ జాబితాకు అంతు లేదు. అలాగే అసిస్టెంట్, ఇంజనీర్, అసిసెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, చీఫ్ ఇంజనీర్ వంటి ఉద్యోగాలు ప్రభుత్వ సంస్థల్లో ఉంటాయి.

- అదే ప్రైవేట్ సెక్టర్‌లోకి వస్తే ట్రైనీ ఇంజనీర్‌తో మొదలై చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వరకు వేర్వేరు హోదాల్లో ఉద్యోగాలు ఉంటాయి. కన్‌స్ట్రక్షన్, డిజైన్ విభాగాల్లో సివిల్ ఇంజనీర్ సేవలు అవసరమవుతాయి. కాడ్(సీఏడీ) సాఫ్ట్‌వేర్‌పై పరిజ్ఞానానికి తోడు ఫైనైట్ ఎలిమెంట్ అనాలిసిస్ అలాగే అవసరమైన నైపుణ్యాలను అలవర్చుకుంటే ప్రైవేటు సంస్థల్లో ఎదుగుదలకు ఢోకా ఉండదు. ఆరంభంలో రెండున్నర నుంచి మూడున్నర లక్షల రూపాయల మేర వార్షిక ప్యాకేజ్ ఉంటుంది. ప్రైవేటు రంగంలో ముఖ్యంగా ఎల్ అండ్ టి మొదలుకుని టాటా ప్రాజెక్టు లిమిటెడ్, గ్యామన్ ఇండియా, గ్యామన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రాజెక్ట్ లిమిటెడ్, ఒమెక్స్, సూపర్‌టెక్, షాపూర్‌జి అండ్ పల్లోంజి గ్రూప్, జీఎంఆర్ గ్రూప్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీజ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, హిందుస్థాన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ, ఆఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అశోకా బిల్డ్‌కాన్, బిఎల్ కాష్యప్ అండ్ సన్స్ లిమిటెడ్, కన్సాలిడేటెడ్ కన్‌స్ట్రక్షన్ కన్సార్టియం లిమిటెడ్, ఎస్సార్ గ్రూప్, ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, జేపీ గ్రూప్, నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్, నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్, పుంజ్ లాయిడ్ తదితరాలు అతి పెద్ద కన్‌స్ట్రక్షన్ కంపెనీల్లో కొన్ని మాత్రమే.

అవసరం

సివిల్ ఇంజనీరింగ్ విషయంలో ప్రమోషన్ కార్యకలాపాలు చాలా అవసరం, కీలకం కూడా. కన్‌స్ట్రక్షన్ పరిశ్రమ, సంబంధిత సంస్థలు, వ్యవస్థలు అలాగే మీడియా ఇందుకు చేతులు కలపాల్సిన అవసరం ఉంది. రెగ్యులేటరీ వ్యవస్థలు, ప్రొఫెషనల్ సంస్థలతో కూడా కలిసి పనిచేయాలి. పే ప్యాకేజ్‌తో మొదలుపెట్టి కరికులమ్‌లో ఇండస్ట్రీ నిర్దేశిత థియరటికల్ కాన్సెప్ట్స్, నైపుణ్యాల పెంపుపై దృష్టి సారించాలి. అన్నింటికీ మించి అటు ఇండస్ట్రీ ఇటు విద్యా సంస్థలు చేతులు కలపాలి. వివిధ ఇంజనీరింగ్ విభాగాల మధ్య విద్యా సంస్థల్లో సీట్లు - భర్తీ విషయంలోనూ శాస్త్రీయ విధానాన్ని అమలు చేయాలి. ఒక జాబ్‌కు ఉన్న డిమాండ్, వేకెన్సీలను దృష్టిలో పెట్టుకుని ఇదంతా జరిగితే ఇంజనీరింగ్ విద్యావ్యవస్థలో మంచి రోజులు రావడమే కాదు, ఫలితాలూ బాగుంటాయి.

జేఎన్‌టీయూహెచ్‌లో ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు

హైదరాబాద్‌లోని జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూహెచ్)కి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ ఇన్నోవేటివ్ లెర్నింగ్ అండ్ టీచింగ్(డీఐఎల్‌టీ)- ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో కోర్సు వ్యవధి ఆర్నెల్లు. ప్రతి కోర్సులో మూడు థియరీ సబ్జెక్టులు ఉంటాయి. ఒక్కో సబ్జెక్టుకు రెండు నెలల సమయం, 24 తరగతులు, మూడు క్రెడిట్‌లు నిర్దేశించారు. సాయంత్రం ఆరున్నర నుంచి ఎనిమిదిన్నర వరకు ఆన్‌లైన్ సెషన్స్ ఉంటాయి. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. అదనంగా ఒక నెల ప్రాజెక్ట్ వర్క్ చేయాల్సి ఉంటుంది. దీనికి ఆరు క్రెడిట్‌లు ఉంటాయి. కోర్సులో భాగంగా అసైన్‌మెంట్‌లు, ఎండ్ ఎగ్జామినేషన్ ఉంటాయి. అసైన్‌మెంట్‌లకు 40 శాతం, ఎండ్ ఎగ్జామినేషన్‌కు 60 శాతం వెయిటేజీ ఇస్తారు. ఫ్యాకల్టీ మెంబర్లు, ఉద్యోగస్తులు, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో అడ్మిషన్స్ ఇస్తారు. యూనివర్సిటీకి చెందిన టీచింగ్&నాన్ టీచింగ్ సిబ్బంది, అకడమిక్ స్టూడెంట్స్‌కు కోర్సు ఫీజులో 40 శాతం రాయితీ లభిస్తుంది.

క్లౌడ్ అండ్ డెవోప్స్ కోర్సు: ఇందులో క్లౌడ్ టెక్నాలజీ ఏడబ్ల్యూఎస్ & మైక్రోసాఫ్ట్ అజ్యూర్, కంటిన్యూయస్ ఇంటిగ్రేషన్/కంటిన్యూయస్ డిప్లాయ్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవిజనింగ్ సబ్జెక్టులు ఉంటాయి.

డేటా సైన్స్ అండ్ జనరేటివ్ ఏఐఎల్‌ఎల్ఎమ్ కోర్సు: ఇందులో పైథాన్ ప్రోగ్రామింగ్, మెషిన్ లెర్నింగ్-డీప్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐ అండ్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ సబ్జెక్టులు ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి డిప్లొమా/యూజీ/పీజీ పూర్తిచేసిన/చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. కంప్యూటర్స్‌కు సంబంధించి ప్రాథమిక పరిజ్ఞానం, ఏదేని ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌పై అవగాహన తప్పనిసరి.

- **కోర్సు ఫీజు:** రూ.25,000
- **అడ్మిషన్ ఫీజు:** రూ.1000
- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 20
- **దరఖాస్తుల పరిశీలన:** జూలై 31
- **ఆన్‌లైన్ మోడ్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్:** ఆగస్టు 1 నుంచి 7 వరకు
- **అడ్మిషన్ ఫీజు, ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** ఆగస్టు 14
- **అడ్మిషన్ పొందిన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 17
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** ఆగస్టు 20 నుంచి
- **ప్రోగ్రామ్‌ల ముగింపు:** 2025 ఫిబ్రవరి 19న
- **వెబ్‌సైట్:** www.jntuh.ac.in

పీజేటీఎస్ఏయూలో యూజీ ఎన్ఆర్ఐ కోటా

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ)-ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కోటా కింద బీఎస్సీ ఆనర్స్, బీటెక్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. విదేశాల్లో నివశిస్తున్న ఎన్ఆర్ఐ అభ్యర్థులు, ఎన్ఆర్ఐలు స్పాన్సర్ చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపీసీ, బైపీసీ స్ట్రీమ్‌లలో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. అకడమిక్ మెరిట్(ఇంటర్/పన్నెండోతరగతి మార్కులు) ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైన అభ్యర్థులు రూ.9,53,450లకు డీడీ, రూ.46,550ల నగదుతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి. వీరికి ఫీ రీయింబర్స్‌మెంట్, ప్రభుత్వ రాయితీలు లభించవు. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు.

- **బీటెక్ స్పెషలైజేషన్‌లు:** ఫుడ్ టెక్నాలజీ, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్
- **బీఎస్సీ ఆనర్స్ స్పెషలైజేషన్‌లు:** అగ్రికల్చర్, కమ్యూనిటీ సైన్స్

బైపీసీ స్ట్రీమ్ కళాశాలలు-సీట్లు: హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్‌లో బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ 10 సీట్లు; నిజామాబాద్-రుద్రూర్‌లోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) 1 సీటు; హైదరాబాద్-సైఫాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ 2 సీట్లు ఉన్నాయి.

ఎంపీసీ స్ట్రీమ్ కళాశాలలు-సీట్లు: సంగారెడ్డి-కందిలోని కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్‌లో బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) 3 సీట్లు; నిజామాబాద్-రుద్రూర్‌లోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) 1 సీటు; హైదరాబాద్-సైఫాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ 2 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: బైపీసీ స్ట్రీమ్ కింద అప్లయ్ చేసుకోవాలంటే గుర్తింపు పొందిన బోర్డు(ఇండియన్/విదేశీ బోర్డు) నుంచి బయలాజికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి.

- ఎంపీసీ స్ట్రీమ్ కింద అప్లయ్ చేసుకోవాలంటే ఏదేని ఇండియన్/విదేశీ బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజికల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి పూర్తిచేసి ఉండాలి.
- అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

ముఖ్య సమాచారం

- **ప్రాసెసింగ్ ఫీజు:** రూ.5,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in

నీలిట్‌లో డిప్లొమా, డిగ్రీ, పీజీ

అగర్తలాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(నీలిట్)- ఇంజనీరింగ్ డిప్లొమా, బీసీఏ, ఎమ్మెస్సీ(ఐటీ) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

ఇంజనీరింగ్ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కోదానిలో 60 సీట్లు చొప్పున మొత్తం 120 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 35 శాతం మార్కులతో పదోతరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

బీసీఏ(బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్): ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో 40 సీట్లు ఉన్నాయి.

అర్హత: మేథ్స్, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్ సబ్జెక్టులలో ఏవేని రెండు సబ్జెక్టులతో ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు; మూడేళ్ల వ్యవధి గల ఏదేని ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు.

ఎమ్మెస్సీ(ఐటీ): ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో మొత్తం 30 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఎస్సీ(ఐటీ/సీఎస్)/బీసీఏ/బ్యాచిలర్ డిగ్రీ(కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. మేథ్స్ ఒక సబ్జెక్ట్‌గా ఇంటర్‌తో పాటు బీఎస్సీ/బీకాం/బీఏ పూర్తిచేసినవారు కూడా అర్హులే.

- **ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 28
- **ఎంపికైన అభ్యర్థుల మొదటి లిస్ట్ విడుదల:** జూలై 4న
- **వెబ్‌సైట్:** nielitagtadmission.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/w3c3dM3లో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

పీరియాడిక్ యాక్షన్ డ్రామా



'విరుపాక్ష', 'బ్రో' చిత్రాల తర్వాత సాయిదుర్గ తేజ్ నటిస్తున్న కొత్త చిత్రం షూటింగ్ ఇటీవల ప్రారంభమైంది. రోహిత్ కేపీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. చుట్టూ ల్యాండ్ మైన్లు, మధ్యలో ఎడారి భూమిలో ఓ పచ్చని చెట్టు.. ఉన్న ఈ పోస్టర్ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ఓ యూనివర్సల్ కాన్సెప్ట్‌తో ఈ సినిమా ఉంటుందని పోస్టర్ చూడగానే అర్థమవుతుంది. నిర్మాతలు మాట్లాడుతూ 'గ్రాండ్ స్కేల్‌లో భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో హీరో సాయి పాత్ర చాలా శక్తిమంతంగా ఉంటుంది. ప్రత్యేకంగా రూపొందించిన భారీ సెట్‌లో ప్రస్తుతం షూటింగ్ జరుగుతోంది. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేస్తాం' అని చెప్పారు.

మా ఊరు శ్రీకాకుళం..



'వెన్నెల' కిశోర్, అనన్య నాగళ్ల కీలక పాత్రలు పోషిస్తున్న చిత్రం 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. రైటర్ మోహన్ దర్శకత్వంలో వెన్నపూస రమణారెడ్డి నిర్మిస్తున్నారు, ఇటీవల విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌కు మంచి స్పందన వచ్చింది. తాజాగా ఈ సినిమాలోని 'మా ఊరు శ్రీకాకుళం' పాటను దర్శకుడు హరీశ్ శంకర్ విడుదల చేశారు. శ్రీకాకుళం గొప్పతనం వివరిస్తూ రామజోగయ్య శాస్త్రి రాసిన పాటను మంగ్లీ పాడారు. సునీల్ కశ్యప్ స్వరపరిచారు. ఈ సందర్భంగా హరీశ్ శంకర్ మాట్లాడుతూ 'ఈ సినిమా టైటిల్ ఫన్నీగా ఉంది. మోహన్ రచయితగా నాకు చాలా కాలం నుంచి తెలుసు. పాట విజువల్స్ బాగున్నాయి. మంగ్లీ బాగా పాడింది. వెన్నెల కిశోర్ నుంచి ఒక డిఫరెంట్ సినిమా ఎక్స్‌పెక్ట్ చేస్తున్నా' అన్నారు. ఈ చిత్రానికి పాటలు: రామజోగయ్య శాస్త్రి, కాసర్ల శ్యామ్, ఫొటోగ్రఫీ: మల్లికార్జున్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రాజేశ్ రామ్, సమర్పణ: లాస్య రెడ్డి.

ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా



తమిళ అగ్రహీరోలు రజనీకాంత్, కమల్ హాసన్ యాక్షన్ బాట పట్టారు. 'విక్రమ్', 'జైలర్' చిత్రాలతో వీరిద్దరూ తమిళంలోనే కాకుండా పాన్ ఇండియా స్థాయిలో సంచలన విజయాలు అందుకున్నారు. దీంతో తదుపరి చిత్రాలు కూడా ఇదే జానర్లో చేస్తున్నారు. మణిరత్నం దర్శకత్వంలో కమల్‌హాసన్ 'థగ్‌లైఫ్' కూడా యాక్షన్ ప్యాక్డ్‌గా ఉండబోతోంది. అలాగే శంకర్ దర్శకత్వంలో వస్తున్న 'భారతీయుడు 2' చిత్రంలో పోరాట ఘట్టాలపై అంచనాలు భారీ స్థాయిలో ఉన్నాయి. 'జైలర్' ఊపులో రజనీకాంత్ సైతం ఇలాంటి చిత్రాలకు పెద్ద పీట వేస్తున్నారు. ప్రస్తుతం ఆయన హీరోగా రూపొందుతున్న చిత్రం 'వేట్టయాన్'. 'జై భీమ్' ఫేమ్ జ్ఞానవేల్ రాజా దర్శకుడు ఇందులో రజనీకాంత్ ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ పాత్రలో కనిపించనున్నారు. చిత్రీకరణ చివరి దశలో ఉంది. 'వేట్టయాన్' తర్వాత రజనీకాంత్ లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో 'కూలీ' చిత్రం చేస్తున్నారు. అయితే రజనీకాంత్ ఈ సినిమాలో కూడా ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గానే కనిపించనున్నారని కోలీవుడ్ టాక్. మానవ అక్రమ రవాణాను అడ్డుకునే నిజాయితీపరుడైన పోలీస్ ఆఫీసర్‌గా, క్రిమినల్స్‌ను ఏరివేసేందుకు ఎంతకైనా తెగించే ఖాకీగా ఆయన శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారట.

ఈసారి కూడా ఓటమి లేదు



'ఇప్పటిదాకా ఒక్క ఫైట్ కూడా ఓడిపోలేదు, ఈ సారి కూడా ఓడిపోను, బాగా ప్రిపేరయ్యి వచ్చాను... చూసుకుందాం రా' అంటూ ప్రత్యర్థులకు సవాల్ విసురుతున్నారు ప్రభాస్. భారతీయ సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'కల్కి 2898 ఏడీ' చిత్రం కోసం ప్రభాస్ చెప్పిన డైలాగ్ ఇది. ఈ నెల 27న ఈ చిత్రం విడుదలవుతోంది. శుక్రవారం చిత్రబృందం రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేసింది. అమితాబ్ బచ్చన్ అశ్వత్థామగా డేరింగ్ స్టంట్స్ చేశారు. కమల్‌హాసన్ పూర్తిగా సరికొత్త లుక్‌లో ఆశ్చర్యపరిచారు. బుజ్జితో కలసి ప్రభాస్ చేసిన సాహసాలు, పోరాట ఘట్టాల్లో దిశా పటానీ మెరుపులతో ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంది. ప్రభాస్, దీపికా పదుకొనే జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి నాగ్ అశ్విన్ దర్శకుడు. వైజయంతీ మూవీస్ పతాకంపై సి. అశ్వనీదత్ నిర్మిస్తున్నారు.

ఒదిగి ఉండే వ్యక్తిత్వం ఆయన సొంతం



ఇటీవలే ముంబైలో 'కల్కి' చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో అమితాబ్ బచ్చన్ నిర్మాత సి. అశ్వనీదత్ పాదాలకు నమస్కరించబోగా, ఆయన సున్నితంగా వారించారు. ఆ తర్వాత అమితాబ్ పాదాలకు అశ్వనీదత్ నమస్కరించారు. అమితాబ్ లాంటి దిగ్గజ నటుడు తన వయసు, స్టార్‌డమ్‌ను పక్కనపెట్టి నిర్మాతకు ఎంతో గౌరవం ఇస్తూ పాదాభివందనం చేయడం ఆయన సంస్కారం, గొప్ప మనసుకు నిదర్శనం అని నెటిజన్లు కొనియాడారు. ఆ సంఘటనపై నిర్మాత అశ్వనీదత్ శుక్రవారం సోషల్ మీడియా వేదికగా స్పందించారు. అసలు అమితాబ్ ఆ రోజు ఈవెంట్‌లో అలా చేస్తారని తాను ఊహించలేదని చెప్పారు. 'నేను తేరుకొని ఆయనకు ప్రతి నమస్కారం చేయడానికి కొంచెం సమయం పట్టింది. అమితాబ్‌బచ్చన్ భారతీయ సినిమా యోధుడు ఎంత ఎదిగినా ఒదిగి ఉండే ఆయన వ్యక్తిత్వానికి మరోసారి అభివందనం చేస్తున్నాన'ని తెలిపారు.





రివర్స్ లవ్‌స్టోరీ

ఆంగ్లంలో 'లవ్' అనే నాలుగు అక్షరాలను రివర్స్ చేస్తే 'ఈవోల్' అని వస్తుంది. ఆ టైటిల్‌తో ఓ రివర్స్ లవ్‌స్టోరీ వస్తోంది. సూర్య శ్రీనివాస్, శివ బొడ్డురాజు హీరోలుగా, జెన్నిఫర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో దర్శకనిర్మాత రామ్ యోగి వెలగపూడి శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ 'ఇద్దరు స్నేహితుల మధ్య కుదిరిన అవగాహన నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. వాణిజ్య విలువలతో క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందించాను. హైదరాబాద్, వైజాగ్‌లో షూటింగ్ జరిగింది' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, ఫొటోగ్రఫీ: తేడా బ్యాచ్ సినిమా టీమ్, ఎడిటింగ్: విజయ్.

బుజ్జిమేక.. బుజ్జిమేక



గ్రామీణ నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'పొట్టేల్'. యువచంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల ముఖ్య పాత్రధారులు. సాహిత్ మోత్కూరి దర్శకుడు. ఇప్పటి వరకూ విడుదలైన మూడు పాటలు ప్రేక్షకుల్ని అలరించాయి. తాజాగా నాలుగో పాటను శుక్రవారం విడుదల చేశారు. 'బుజ్జి మేక.. బుజ్జిమేక' అంటూ సాగే ఈ పాటను కాసర్ల శ్యామ్ రాయగా, కాలభైరవ పాడారు. శేఖర్‌చంద్ర స్వర పరిచారు. పాటలో విజువల్స్ ఆకట్టుకొనేరీతిలో ఉన్నాయి. హార్ట్ టచింగ్ సాంగ్‌గా దర్శకుడు చిత్రీకరించారు. అజయ్, ప్రియాంక శర్మ, తనస్వి చౌదరి, నోయల్ సీన్, ఛత్రపతి శేఖర్, శ్రీకాంత్ అయ్యంగార్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిశాంక్ రెడ్డి కుడితి, సురేశ్‌కుమార్ నడిగే నిర్మాతలు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/DiKTPSo లో చదవండి.

శ్రీముఖలింగేశ్వరునికి మంగళ స్నానం


పార్వతీ పరమేశ్వరుల ఉత్సవమూర్తులకు మంగళస్నానాలు చేయిస్తున్న అర్చకులు

జలుమూరు: సుప్రసిద్ధ శైవ క్షేత్రం శ్రీముఖలింగేశ్వరస్వామి మంగళస్నానాలు శుక్రవారం వంశధార నదిలో అర్చకులు వైభవంగా నిర్వహించారు. పంచరాత్రి కల్యాణ మహోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవతో మేల్కొలిపారు. ఆలయ ధర్మకర్త పర్లాకిమిడి మహారాజు పేరున ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులను ప్రత్యేక పల్లకిలో ఆసీనులను చేసి మంగళవాయిద్యాలతో, వేదమంత్రాల నడుమ వంశధార నదికి తీసుకెళ్లారు. పవిత్ర వంశధార నదిలో ఉత్సవ మూర్తులకు పూజలు చేసి మంగళస్నానాలు నిర్వహించారు. భక్తులు వంశధార నదిలో స్నానాలు ఆచరించి పునీతులయ్యారు. ఈ కార్యక్రమంలో అర్చకులు నారాయణమూర్తి, వెంకటాచలం, అచ్యుత, సింహాచలం, అప్పారావు, శ్రీకృష్ణ, దేవాదాయ సిబ్బంది పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా జగన్నాథ స్వామి నేత్రోత్సవం

స్థానిక నలనాగుల వీధిలో వెలసిన శ్రీ జగన్నాథ స్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం స్వామికి కనులపండువగా నేత్రోత్సవం నిర్వహించారు. జేష్ఠ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని అర్చకుడు భానోజీరావు నేతృత్వంలో స్వామివారి నేత్రోత్సవం జరిపించారు. సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథ స్వామి ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణంలో ఆసనం ఏర్పాటుచేసి ఆసీనులను చేశారు. మంగళ వాయిద్యాలతో, వేదమంత్రాల నడుమ పాలు, తేనె, నెయ్యి, పంచదార, పంచామృతాలతోను, 108 కొబ్బరి బొండాలతోను స్వామివారికి అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో భక్తులు మురళీమోహనరావు, ప్రభాకరరావు, జగన్నాథరావు, శంకరరావు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ అవకతవకలపై విచారణకు డిమాండ్

పోలాకి: పోలాకి పంచాయితీ నర్సాపురం వద్ద మంజూరు చేసిన జగనన్న కాలనీ అవకతవకలపై ఉన్నతాధికారులతో సమగ్ర విచారణ చేపట్టాలనే డిమాండ్‌తో స్థానిక యువజన నాయకులు, కూటమి నాయకులు శుక్రవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉండగా అర్హత లేని వారికి ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని వైసీపీ నేతలు మౌఖిక ఆదేశాలు ఇచ్చారని.. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. 163-3 సర్వే నంబర్‌లో స్థానికేతరులకు, ఒకే కుటుంబంలో ఉన్న వ్యక్తులకు కాలనీ ఇళ్ల మంజూరు చేశారని ఆరోపించారు. దీనిపై ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు ఫిర్యాదు చేశామని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులతో విచారణ చేపట్టాలని డీటీ శ్రీనివాసరావును శ్యామలరావు, కె.వెంకట్, పి.రామకృష్ణ, లక్ష్మణరావు, గిరి, దుర్గాప్రసాద్, లొట్టి శాంతారావు, భానుకుమార్, సతీష్‌లు కోరారు. ఈ విషయంపై డీటీ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గత మూడు నెలలుగా ఎన్నికల విధుల్లో ఉన్నామని... త్వరలో క్షేత్ర స్థాయికి వెళ్లి విచారణ చేపడతామని చెప్పారు. అర్హత ఉన్న అర్జీదారులకు ఇళ్ల మంజూరు చేస్తామని చెప్పారు.

కళింగదళ్ షట్టర్లకు మరమ్మతులు చేపట్టాలి

మందస/హరిపురం: మందస మండలంలో ప్రధాన సాగునీటి ఆధారమైన కళింగదళ్ ప్రాజెక్టు షట్టర్లు మరమ్మతులు చేపట్టి సాగు నీరు అందించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మందసలో ఆయన శుక్రవారం మాట్లాడుతూ ప్రాజెక్టులో చేరుతున్న నీరు నిల్వ ఉండకుండా వృధా అవుతోందని తెలిపారు. వేల ఎకరాలకు నీరందించే ప్రాజెక్టు రైతులకు ఉపయోగపడడం లేదన్నారు. ఇప్పటికైనా షట్టర్లు మరమ్మతులు చేపట్టి రైతులకు సక్రమంగా నీరందించాలని కోరారు.

ఘనంగా రెయ్యిబోడమ్మతల్లి వార్షికోత్సవం

నందిగాం: పెంటూరు, నరేంద్రపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న రెయ్యిబోడమ్మతల్లి ఆలయ పదో వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. పురోహితులు రేజేటి జోసుబాబు, మేడేపల్లి రమేష్‌శర్మ పర్యవేక్షణలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి భక్తులు ముర్రాటలు చెల్లించి చల్లదనం చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు.

అంబులెన్స్ సేవలు పరిశీలన

పలాస: స్థానిక 108 అంబులెన్స్ సేవలను జిల్లా అధికారి బి.హరిప్రసాద్, డివిజినల్ ఆపరేషన్ అధికారి గండేపల్లి జగన్నాథరావు శుక్రవారం పరిశీలించారు. వాహనం పనితీరు, అత్యవసర సేవల రికార్డులు, డ్యూటీ చార్ట్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్క బాధితుడికి అంబులెన్స్‌లో సేవలు అందించే విధంగా సిబ్బంది సహకరించాలన్నారు. రోడ్డు ప్రమాద బాధితుల వ్యవహారంలో సత్వరమే వైద్య సాయం అందించాలన్నారు. సిబ్బంది బి.తారకేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, సత్యం, వెంకటరావు, మోహనరావు, ఎం.రామచంద్రరావు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా రాజారావు

నందిగాం: నందిగాం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఈవోపీఆర్‌డీ టి.రాజారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో జి.శివప్రసాద్ స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. ఆ స్థానంలో రాజారావును ఎంపీడీవోగా నియమిస్తూ జడ్పీ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

నౌపడలో టీడీపీ విజయోత్సవ ర్యాలీ

సంతబొమ్మాళి: నౌపడలో టీడీపీ విజయోత్సవ ర్యాలీని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి అచ్చెన్నాయుడు ఆరోసారి శాసనసభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. నౌపడ, సీతానగరం, పాలనాయుడుపేట, కూర్మనాథపురం గ్రామాల మీదుగా టీడీపీ నాయకుడు సుగ్గు స్వరూప్‌రెడ్డి నేతృత్వంలో ర్యాలీ సాగింది. కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి క్రికెట్ విజేత మందస

హరిపురం: మందస మండలం పొత్తంగి సిరిపురం గ్రామంలో గత 20 రోజులుగా నిర్వహిస్తున్న శ్రీ పొత్తేశ్వర డివిజన్ స్థాయి క్రికెట్ పోటీల్లో విజేతగా మందస జట్టు నిలిచింది. సుమారు 42 జట్లు పాల్గొన్న ఈ టోర్నీలో మందస, పొత్తంగి జట్లు ఫైనల్‌కు చేరాయి. విజేతగా నిలిచిన మందస జట్టుకు రూ.15వేల నగదుతో పాటు షీల్డును మాజీ సర్పంచ్ బోర హిమావతి, రన్నర్‌గా నిలిచిన పొత్తంగి జట్టుకు రూ.8వేల నగదుతోపాటు షీల్డును గేదెల భీమారావులు స్పాన్సర్ చేశారు. విజేతలకు శుక్రవారం మందస టీడీపీ అధ్యక్షులు బావన దుర్యోధన, మాజీ ఎంపీటీసీ కృష్ణారావులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజాన మహేష్, డొంకూరు తిరుపతిరావు, ముంజేటి చంద్రశేఖర్, రట్టి లింగరాజు, దువ్వు బాబూరావు, లబ్బ రుద్రయ్య, బేసి ఈశ్వరరావు, బోర వాసురెడ్డి, గిరి నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి జిల్లా స్థాయి చదరంగం పోటీలు

టెక్కలి: ఈనెల 23 నుంచి శ్రీకాకుళం నానుబాలవీధిలో గల శిక్షణ కేంద్రంలో అండర్-19 చదరంగం పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బగాది కిషోర్, జామి రమేష్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు జూలై నెలలో నంద్యాలలో జరగబోయే రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

అందరికీ విత్తనాలు అందిస్తాం

వజ్రపుకొత్తూరు: అందరికీ విత్తనాలు అందిస్తామని టీడీపీ మండల తెలుగుయువత అధ్యక్షులు మరడ ధుర్యోధనరెడ్డి అన్నారు. శుక్రవారం అనంతగిరి పంచాయితీలో రైతులకు విత్తనాలు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల యాదవ సంఘం అధ్యక్షులు ఉంగ భుజంగరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహికి సత్కారం

ఒడిశా

పర్లాకిమిడి: స్థానిక ఎమ్మెల్యే రూపేష్‌కుమార్ పాణిగ్రాహికి ఆర్ఎంసీ కార్యాలయం ఉద్యోగులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం నియోజకవర్గానికి వచ్చిన ఆయనకు సత్కరించి..జ్ఞాపిక అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రూపేష్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతర కృషి చేస్తానని తెలిపారు. నిత్యం ప్రజాసేవలో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

బద్రీనాథ్‌లో నడగాం వాసి మృతి

నరసన్నపేట: నడగాం గ్రామానికి చెందిన రిటైర్డు పంచాయతీ కార్యదర్శి దొంపాక సుధాకర్ (68) బద్రీనాథ్‌లో గుండెపోటుతో గురువారం మృతి చెందినట్టు ఆర్‌ఐ లోకేష్ తెలిపారు. 15 రోజుల కిందట తీర్థయాత్రలకు వెళ్లిన సుధాకర్.. గురువారం బద్రీనాథ్ చేరుకుని స్వామి వారిని దర్శించుకున్న తర్వాత గుండెపోటుకు గురై మృతి చెందాడు. అక్కడి అధికారులు నుంచి సమాచారం వచ్చినట్టు ఆర్‌ఐ స్పష్టం చేశారు. సుధాకర్‌కు భార్య అప్పలనర్సమ్మ, కుమారుడు పవన్ కుమార్ ఉన్నారు.

వివాహిత కిడ్నాప్‌పై కేసు నమోదు

శ్రీకాకుళం క్రైం: ఓ వివాహిత కిడ్నాప్‌పై కేసు నమోదు చేసినట్టు వన్‌టౌన్ ఎస్‌ఐ ఎస్‌ఐ శ్యామలరావు తెలిపారు. శుక్రవారం ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని మంగువారితోటకు చెందిన జి.తేజేశ్వరరావు పొన్నాడకు చెందిన వల్లంగి పల్లవి ప్రేమించుకున్నారు. వీరి పెళ్లికి పెద్దలు అంగీకరించలేదు. దీంతో వారు బయటకు వచ్చేసి వివాహం చేసుకుని మంగువారితోటలో నివాసం ఉంటున్నారు. ఇదిలావుంటే తన కుమార్తె కనిపించడం లేదని పల్లవి తల్లి సుశీల ఎచ్చెర్ల పోలీసులకు ఈ నెల 5న ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు దర్యాప్తు చేయగా.. తాము మేజర్లమని, రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నామని పల్లవి చెప్పడంతో ఆమె వాంగ్మూలం నమోదు చేసుకుని తేజేశ్వరరావుకి అప్పగించారు. ఈ క్రమంలో ఈ నెల 20వ తేదీ గురువారం పల్లవి తల్లి సుశీల కొంత మందితో మంగువారితోటలో ఉన్న తేజేశ్వరరావు ఇంటికి వెళ్లి సామగ్రి చెల్లాచెదురు చేసి పల్లవిని తీసుకుని వెళ్లిపోయారు. దీంతో తేజేశ్వరరావు తన భార్యను కిడ్నాప్ చేశారని ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ద్విచక్రవాహనాలు ఢీ.. ముగ్గురికి గాయాలు

నందిగాం: పెంటూరు సమీపాన ఆర్అండ్‌బీ రహదారిపై శుక్రవారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వజ్రపుకొత్తూరు మండలం గూనాలపాడుకు చెందిన చెన్నంశెట్టి పాపారావు ద్విచక్రవాహనంపై నందిగాం వస్తుండగా పెంటూరుకు చెందిన సనపల నాగభూషణరావు తన భార్య లలితమ్మతో ద్విచక్రవాహనంపై ఎదురుగా వస్తూ ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో పాపారావు ఎడమకాలు విరిగిపోగా, నాగభూషణరావు, లలితమ్మకు గాయాలయ్యాయి. గాయపడిన వీరిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. పాపారావు కుమారుడు ధర్మరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు


గాయపడిన రిషికా

వజ్రపుకొత్తూరు: చినడోకులపాడు కాలనీ రహదారిలో శుక్రవారం రేపల్లికి చెందిన రెండున్నరేళ్ల చిన్నారి రిషికాపై కుక్కలు దాడి చేశాయి. చిన్నారి చేయి, శరీరంపై గాయాలయ్యాయి. స్థానికులు అప్రమత్తమై కేకలు వేయడంతో కుక్కలు పారిపోయాయని చెప్పారు. రెండు రోజుల క్రితం ఇదే గ్రామానికి చెందిన హాసిని అనే చిన్నారిపై కుక్కలు దాడి చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. గాయపడిన చిన్నారులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల దాడుల నుంచి తమను కాపాడాలని ఈ ప్రాంతీయుల కోరుతున్నారు.

ఆదిత్యుని సన్నిధిలో హైకోర్టు రిటైర్డు జడ్జి


రిటైర్డు న్యాయమూర్తికి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

అరసవల్లి: ఆరోగ్యప్రదాత సూర్యనారాయణ స్వామివారిని రాష్ట్ర హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ ఎంఎం సీతారాం శుక్రవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు స్వాగతం పలికి వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి జ్ఞాపికను ఆలయ జూనియర్ అసిస్టెంట్ బీఎస్ చక్రవర్తి వారికి అందజేశారు. జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా, డీఎల్ఎస్ఏ కోర్టు న్యాయమూర్తి సన్యాసినాయుడు, అర్చకులు ఇప్పిలి రంజిత్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీపై రభస

కవిటి: బెలగాం గ్రామ పంచాయతీలో గురువారం వైసీపీ ఎమ్మెల్సీ నర్తు రామారావు విత్తనాలు పంపిణీ చేయడం రభసగా మారింది. ఎమ్మెల్యే అశోక్ చేతుల మీదుగా విత్తనాల పంపిణీ చేసేందుకు గ్రామానికి చెందిన ఎంపీటీసీ, టీడీపీ నాయకులు నిర్ణయించారు. అంతలోనే వైసీపీ చెందిన సర్పంచ్, నేతలు కలిసి ఎమ్మెల్సీ చేతుల మీదుగా బలవంతంగా పంపిణీ చేశారని సచివాలయ అగ్రికల్చరల్ అసిస్టెంట్ దాసరి జయశ్రీరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే ద్వారా పంపిణీ చేయనున్నట్టు చెప్పినా వైసీపీ నాయకులు వినలేదని తెలిపారు. వ్యవసాయాధికారి ఆదేశాల మేరకు వైసీపీ నేతలు ఒత్తిడితో కార్యక్రమం నిర్వహించినట్టు జయశ్రీరెడ్డి తెలిపారు. దీంతో పంచాయతీలో ఇరుపక్షాల మధ్య రభస జరిగింది.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కంచిలి: ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్టు ఎస్ఈబీ సీఐ ఆర్.జైభీమ్ శుక్రవారం తెలిపారు. మండలంలోని జె.శాసనాం వద్ద తనిఖీలు చేస్తుండగా బాతుపురం నుంచి కంచిలికి ఎటువంటి పత్రాలు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్టు తెలిపారు. కేసు నమోదు చేసి కంచిలి పోలీసులకు అప్పగించినట్టు ఆయన తెలిపారు.

టీడీపీ అభినందన సభ


అభినందన సభలో పాల్గొన్న టీడీపీ నాయకులు

మెళియాపుట్టి: పాతపట్నం ఎమ్మెల్యేగా మామిడి గోవిందరావు శుక్రవారం మొదటిసారిగా అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో శుక్రవారం మర్రిపాడు సర్పంచ్ రవ్వల అనురాధ గణపతి ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. టీడీపీ నాయకులు శంకర్, లక్ష్మీనారాయణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీ విజయవంతం చేయండి

ఆమదాలవలస: జిల్లాలో ఈ నెల 23న ఆదివారం నిర్వహించనున్న ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని టీడీపీ నాయకులు తమ్మినేని విద్యాసాగర్, సనపల డిల్లీశ్వరరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం శాసనసభలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి జిల్లాకు వస్తున్న రవికుమార్‌కు ఘన స్వాగతం పలకాలన్నారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు విశాఖ విమానాశ్రయంలో స్వాగతం పలికి, జిల్లా సరిహద్దు పైడి భీమవరం వద్ద కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానుల మధ్య శ్రీకాకుళం సింహద్వారం మీదుగా పట్టణంలో ర్యాలీగా ఆమదాలవలస ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకుంటుందన్నారు. అనంతరం ఆమదాలవలస పట్టణంలో ర్యాలీ నిర్వహించి కృష్ణాపురం జంక్షన్ వద్ద నిర్వహించే సమావేశానికి హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గౌరీ ప్రతీశ్వరరావు, సంపత్‌రావు, మురళీధరరావు, వండాన ఉదయ్, ఎండ అప్పలనాయుడు, నేతింటి జ్యోతి, సనపల చెల్లంనాయుడు పాల్గొన్నారు.

9 క్వింటాళ్ల గంజాయి స్వాధీనం

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహన సమితి కర్రిగూడ పంచాయతీ ఆరుంపేట అటవీ ప్రాంతంలో 9 క్వింటాళ్ల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న సమయంలో అబ్కారీ శాఖ అధికారులతో కలిసి పోలీసులు దాడి చేయగా నిందితులు గంజాయిని వదిలి పరారయ్యారు. నిందితులను పట్టుకునేందుకు చర్యలు చేపట్టినట్లు మోహన పోలీసు అధికారి సుబ్రాంత్ కుమార్ తెలిపారు.


రణస్థలం: కొండములగాం ఆదర్శ పాఠశాలలో..


ఎచ్చెర్ల: బీఆర్ఏయూలో వీసీ రజని తదితరులు


యోగాసనాలు వేస్తున్న ఎస్పీ రాధిక


ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో ..


శ్రీకాకుళం స్పోర్ట్స్: యోగాసనాల్లో అధికారులు


వివిధ సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు

జీవితంలో యోగా భాగం కావాలి

● జిల్లా రెవెన్యూ అధికారి గణపతిరావు

శ్రీకాకుళం స్పోర్ట్స్: నిత్య జీవితంలో యోగా భాగం కావాలని డీఆర్వో ఎం.గణపతిరావు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆయుష్ శాఖ, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం, యువజన సర్వీసులు, క్రీడా ప్రాధికార సంస్థ సంయుక్తంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో యోగా డే నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ చిన్నతనం నుంచే యోగాభ్యాసాన్ని అలవర్చుకోవాలన్నారు. నేటి జీవన విధానంలో నిత్యం అధిక ఒత్తిడి ఎదుర్కొంటున్నామని, తద్వారా అనారోగ్యానికి గురయ్యే ప్రమాదముందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో యోగా చక్కని పరిష్కారమన్నారు. సుమారు 1500 మంది యోగా సాధకులు, అధికారులు, క్రీడాకారులు పాల్గొని 45 నిమిషాల పాటు వివిధ ఆసనాలను యోగా శిక్షకులు మురళి పర్యవేక్షణలో చేపట్టారు. రిటైర్డు న్యాయాధికారి పప్పల జగన్నాథం, డీఈవో కె.వెంకటేశ్వరరావు, మెప్మా పీడీ కిరణ్, ఆర్ఐవో దుర్గా ప్రసాద్, ఆయుష్ వైద్యాధికారి పి.జగదీష్, ఉత్తమరాజ్, సెట్‌శ్రీ సీఈవో బీవీ ప్రసాదరావు, డీఎస్‌డీవో కె.శ్రీధర్, జిల్లా పర్యాటన అధికారి నారాయణరావు, ఎన్‌వై కే సమన్వయకర్త ఉజ్వల్, డీపీవో చెన్నకేశవరావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేష్, వాకర్స్ క్లబ్, యోగా శిక్షణా కేంద్రాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


కంచిలి: ఎస్ఆర్సీ పురం పాఠశాలలో..

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పలాస రూరల్: యోగా మన జీవితంలో భాగమైతే సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చునని ఆర్డీవో భరత్‌నాయక్ అన్నారు. పలాస మండలం రామకృష్ణాపురం వద్ద గల సత్యసాయి విద్యావిహార్ పాఠశాలలో శుక్రవారం యోగా దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులు యోగాసనాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఆర్డీవోను స్కూల్ యాజమాన్యం ఘనంగా సత్కరించింది. లొద్దభద్ర ప్రాథమికోన్నత పాఠశాలలో ఆర్ఎస్ఎస్ సభ్యుడు కొత్తపల్లి చిన్నాచారి ఆధ్వర్యంలో యోగాదినోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు.


టెక్కలి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలీసులు..


పొందూరు: న్యాయాధికారి జ్యోత్స్న ఆధ్వర్యంలో..


సంతబొమ్మాళి: కస్తూర్బా పాఠశాలలో..


పాతపట్నం: న్యాయాధికారి రోజిని ఆధ్వర్యంలో..

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

● జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్


ట్రైనర్‌ను సన్మానిస్తున్న జిల్లా న్యాయాధికారి

శ్రీకాకుళం స్పోర్ట్స్: యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ యోగా శిక్షకుడు కొల్లేరు వెంకటరావు పర్యవేక్షణలో న్యాయాధికారులు కోర్టు సిబ్బంది, న్యాయవాదులు ఆసనాలు వేశారు.


పలాస రూరల్: సత్యసాయి విద్యావిహార్‌లో..


సరుబుజ్జిలి: రొట్టవలస జడ్పీ ఉన్నత పాఠశాలలో..


ఆసనంలో యోగా ట్రైనర్ మోహన్


నరసన్నపేట: కళాశాల మైదానంలో..

అచ్చెన్నాయుడును కలిసిన టీడీపీ నాయకులు


అచ్చెన్నాయుడితో టీడీపీ నాయకులు

కొత్తూరు: రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కొత్తూరు మండల టీడీపీ నాయకులు విజయవాడలో కలిసి అభినందనలు తెలిపారు. నాయకులు మాతల గాంధీ, అగత ముడి అరుణ్‌కుమార్, అగతముడి మాధవరావు, ముగిలి కృష్ణ, వెంకటరమణ ఉన్నారు.

ఎమ్మెల్యే గోవిందరావుకు అభినందనలు


మెళియాపుట్టి: అభినందనలు తెలుపుతున్న నేతలు

ఎల్ఎన్ పేట: పాతపట్నం ఎమ్మెల్యేగా గెలుపొంది అసెంబ్లీలో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసిన మామిడి గోవిందరావుకు మండల టీడీపీ నాయకులు అమరావతిలో కలిసి అభినందనలు తెలిపారు. పార్టీ నాయకులు వి.గోవిందరావు, కె.కృష్ణమాచారి, ఎస్.తేజేశ్వరరావు, ఎన్.నారాయణరావు, ఎ.పోలినాయుడు, జె.మోహనరావు, జి.గోవిందరావులు తదితరులు ఉన్నారు.

● **మెళియాపుట్టి:** పాతపట్నం ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మామిడి గోవిందరావును పలువురు టీడీపీ నేతలు కలిసి అభినందలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో అనపాన రాజశేఖరెడ్డి, శేఖర్, తిరుపతిరావు ఉన్నారు.

ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలపై కసరత్తు


బ్యాగులు పరిశీలిస్తున్న డీఈవో

పొందూరు: జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టుల వివరాలపై కసరత్తు ప్రారంభించామని డీఈవో వెంకటేశ్వరరావు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యా కిట్ల స్టాల్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్ ఆధారంగా పోస్టుల ఖాళీలు నిర్ణయించామని, ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం ఎక్కువ ఖాళీలు భర్తీ చేయాల్సి వస్తుందన్నారు. ఇందుకోసం రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఖాళీల సంఖ్య నిర్ధారించనున్నట్టు తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆదేశాల మేరకు యూడైస్ కోడ్ ప్రక్రియ కొనసాగుతోందని తక్షణమే పూర్తి చేయాలని ఎంఈవోలను ఆదేశించామన్నారు. డీఈవోతో పాటు ఎంఈవోలు పీవీ రామరాజు, పి.రాజారావు ఉన్నారు.

ఆక్రమణలు తొలగించాలి

సోంపేట: ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు ఉంటే తొలగించాలని రెవెన్యూ అధికారులకు ఆర్డీవో భరత్ నాయక్ ఆదేశించారు. తహసీల్దార్ కార్యాయంలో రెవెన్యూ అధికారులతో శుక్రవారం సమీక్షించారు. గ్రామాల్లో ఉన్న భూ తగాదాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక అక్రమరవాణాపై దృష్టిపెట్టాలని కోరారు. హంద్ హంద్ ఇళ్లను పరిశీలించారు

అతిసార నివారణకు చర్యలు తీసుకోవాలి

కలెక్టరేట్: అతిసార ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ.. అతిసార వ్యాప్తిని అరికట్టడంపై ప్రచారం నిర్వహించాలన్నారు. ఇందుకోసం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు మైక్రో ప్లాన్ అమలు చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, మున్సిపల్ కమిషనర్ తమీమ్ అన్సారియా, డీఆర్వో ఎం.గణపతిరావు, డీపీవో ఎం.వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రసాదరావు, డీఈవో వేంకటేశ్వరరావు తదతరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కరిద్దాం


మాట్లాడుతున్న ట్రైనర్ శషిదేవి

గుజరాతీపేట: మధ్యవర్తిత్వం చేసి కక్షిదారుల కేసులను త్వరితగతిన పరిష్కరిద్దామని తమిళనాడుకు చెందిన సీనియర్ ట్రైనర్ శషిదేవి అన్నారు. మధ్యవర్తిత్వంపై గత మూడు రోజుల నుంచి జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదులకు శిక్షణ కార్యక్రమంలో భాగంలో శుక్రవారం జిల్లా బార్ అసోసియేషన్ న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కక్షిదారులతో ఏ విధంగా నడుచుకోవాలని, వారి ప్రతిపాదనలకు న్యాయవాదులు ఏవిధంగా స్పందించాలన్నదానిపై మెలుకువలు తెలయజేశారు. కార్యక్రమంలో జిల్లా బార్ అధ్యక్షుడు తిలారి ఈశ్వరరావు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, సీనియర్ ట్రైనర్ సుదర్శన సుందర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించండి

పొందూరు: సంవత్సరాల తరబడి ఉపాధి పనులు లేక ఇబ్బందిపడుతున్నామని తక్షణమే ఉపాధి పని కల్పించాలని గోకర్ణపల్లి గ్రామానికి చెందిన వేతనదారులు ఎంపీడీవో సూర్యనారాయణ, ఏపీవో శ్రీనివాసరావును కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం మాజీ ఎంపీటీసీ సీపాన శ్రీరంగనాయకులు ఆధ్వర్యంలో 40 మంది ఉపాధి వేతనదారులు అధికారులను కలిసి వినతిపత్రం ఇచ్చారు. గ్రామంలో ఒక వర్గానికి చెందినవారికి మూడేళ్లగా ఉపాధి పని కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేసారు. పరిశీలించి తక్షణమే పనులు కల్పిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

ఇచ్ఛాపురం: సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని పలువురు కల్యాణ మిత్రలు కోరారు. ఈ మేరకు శుక్రవారం జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజును ఆ పార్టీ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందించారు. గత ప్రభుత్వ హయాంలో 18 నెలలు పనిచేసినా ఒక్క పైసా కూడా ఇవ్వలేదన్నారు. జి.లక్ష్మి, బి.రోహిణి, ఎం.రేణుక, ఐ.పుష్ప, ఎల్.నానీ, ఎల్.పూజ, ఎం.అరుణ, జి.హేమలత ఉన్నారు.

26న సర్వసభ్య సమావేశం

కంచిలి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 26వ తేదీ బుధవారం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వి.నీరజ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు సంబంధిత అధికారులు పూర్తి సమాచారంతో రావాలని, సభ్యులంతా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

113 మందికి ప్రవేశాలు

ఎచ్చెర్ల: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశాలకు ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో కౌన్సెలింగ్ కొనసాగుతుంది. శుక్రవారం నిర్వహించిన కౌన్సెలింగ్‌కు 474 మందికి 230 మంది హాజరై 113 మంది వివిధ ఐటీఐల్లో ప్రవేశాలు పొందారు. శనివారం 431మంది కౌన్సెలింగ్‌కు హాజరుకావల్సి ఉంది. జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎస్.సుధ, జిల్లా కన్వీనర్, ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎస్.సుధాకరరావు పర్యవేక్షణలో ఈ కౌన్సెలింగ్ జరుగుతుంది. ఈ నెల 23వరకు కౌన్సెలింగ్ కొనసాగనుంది.

64మంది ఎంపిక

అరసవల్లి: నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గల నెహ్రూ యువకేంద్రం కార్యాలయంలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ మేళాలో 64 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేసినట్టు జిల్లా ఉపాధి అధికారి కె.సుధ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ఉపాధి కార్యాలయంలో ప్రతీ నెలా నిర్వహించే నాలుగు జాబ్‌మేళాలను వినియోగించుకోవాలన్నారు.

అదనపు బాధ్యతలు

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో సీడీసీ డీన్‌గా సోషల్‌వర్క్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ యు.కావ్యజ్యోత్స్న, చీఫ్ వార్డెన్‌గా బయోటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్.లోకేశ్వరి నియమితులయ్యారు. శుక్రవారం వర్సిటీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

సమన్వయంతో పని చేయాలి

మందస: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని పలాస ఆర్డీవో భరత్ నాయక్ అన్నారు. మందస తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వీఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. నిత్యావసర సరుకులు సక్రమంగా అందజేయాలని, వీఆర్‌వోలు క్షేత్రస్థాయిలో పని చేయాలని ఆదేశించారు. భూ ఆక్రమణలు గుర్తించి వివాదాలు లేకుండా చూడాలన్నారు.

కనక దుర్గమ్మకు పూజలు

జి.సిగడాం: పెంట గ్రామంలోని కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా సుమారు 500 వందల మంది మహిళలు పాల్గొని కుంకుమ పూజలు చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాలను పసుపు, కుంకుమ, ముగ్గురాటలతో శుద్ధి చేశారు. ఆలయ ధర్మకర్త డోల రామారావు ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వినోద సాంస్కృతిక, జానపద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.


కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు